సాక్షి
ఒడిశా

మంగళవారం । 12 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,84,055లు, బంగారం 3 గ్రాముల 800 మిల్లీగ్రాములు వెండి 52గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



రాష్ట్రమంతటా ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయి. ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సమాచారం.

-8లో



జలేశ్వర్ గ్రిడ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

బాలాసోర్ జిల్లా జలేశ్వర్ ప్రాంతం గ్రిడ్ స్టేషన్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది.

-8లో

మళ్లీ రూట్ మారింది..!



సిద్ధమైన కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ప్రారంభం తొలి నుంచి రోజుకో మలుపు తిరుగుతుంది. తొలుత భువనేశ్వర్ నుంచి తదుపరి పూరీ నుంచి విశాఖపట్నం మధ్య ఈ రైలు సేవలు ఉంటాయని ఆదివారం వరకు ప్రకటించారు. తాజాగా సోమవారం సాయంత్రం సరికి 20841/20842 నంబర్ల వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య నడుస్తుందని ప్రకటించారు. సోమవారం మినహా వారానికి 6 రోజులపాటు ఉభయ దిశల్లో రాకపోకలు చేస్తుందని వెల్లడించారు.

హాల్టులు

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య ఖుర్దారోడ్, బలుగాంప్, బరంపురం, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. దీనిలో 8 అధునాతన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ బోగీలు ఉంటాయి.

20841(అప్)		భువనేశ్వర్-విశాఖపట్నం
రాక	పోక	స్టేషన్
-	05.15	భువనేశ్వర్
05.33	05.35	ఖుర్దారోడ్
06.23	06.25	బలుగాంప్
07.05	07.07	బరంపురం
07.18	07.20	ఇచ్ఛాపురం
08.18	08.20	పలాస
09.03	09.05	శ్రీకాకుళం రోడ్
09.48	09.50	విజయనగరం
11.00	--	విశాఖపట్నం

20842(డౌన్)		విశాఖపట్నం-భువనేశ్వర్
రాక	పోక	స్టేషన్
--	15.30	విశాఖపట్నం
16.18	16.20	విజయనగరం
17.08	17.10	శ్రీకాకుళం రోడ్
18.10	18.12	పలాస
18.40	18.42	ఇచ్ఛాపురం
19.00	19.02	బరంపురం
19.52	19.54	బలుగాంప్
20.57	20.59	ఖుర్దారోడ్
21.30	--	భువనేశ్వర్

న్యూస్‌రీల్

బార్ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం



అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తున్న అనిల్ కుమార్ పండా

బరంపురం: ఈనెల 30వ తేదీన గంజాం బార్ అసోసియేషన్ 2023–24 ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని గంజాం బార్ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఎన్నికల అధికారి అనిల్ కుమార్ పండా సమక్షంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అధ్యక్ష, కార్యదర్శి పదవుల కోసం నామినేషన్లు స్వీకరించారు. 17వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 19వ తేదీన నామినేషన్ల స్క్రూట్నీ నిర్వహిస్తారు. 20వ తేదీన విత్‌డ్రా, 21వ తేదీన బరిలో నిలిచే అభ్యర్థుల ప్రకటన జరగనున్నాయి. అనంతరం 30వ తేదీన ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి, అనంతరం ఫలితాలు ప్రకటించనున్నట్లు అనిల్ కుమార్ పండా తెలియజేశారు.

గ్రామస్తుల సహకారంతో భగవతి అంత్యక్రియలు



జయపురం: బొయిపరిగుడ సమితి ఆర్.భల్లుగాం చంద్ర బారిక్ ఇంట్లో ఆదివారం గుప్తేశ్వర్ పంచాయతీ ముర్జాచువ గ్రామానికి చెందిన సుకల్ దురువ కుమార్తె భగవతి దురువ అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమె కులాంతర వివాహం చేసుకోవడం వలన అనాథ శవంగా మిగిలింది. 2018లో భువనేశ్వర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఆదివాసీ వేషధారణ పోటీలో ఆదిరాణిగా టైటిల్ పొందిన భగవతి, అనంతరం వేరే కులం అబ్బాయిని పెళ్లి చేసుకుంది. దీంతో కన్నవారు ఆమె మృతదేహాన్ని తీసుకు వెళ్లలేదు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త కస్టడీలో ఉండడం వలన అత్తింటివారు సైతం ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించారు. దీంతో మరోమార్గం లేక ఆమె మృతదేహానికి బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ సమక్షంలో పోలీసులు, జిల్లా పరిషత్ సభ్యుడు రామేశ్వర మహారియలు గ్రామస్తుల సహకారంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎన్నికలకు సన్నాహాలు



వర్చువల్ సమావేశానికి హాజరైన అధికారులు

భువనేశ్వర్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చురుకుగా సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియమితులైన పరిశీలకులను ఉద్దేశించి సోమవారం భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ సీఈసీ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వర్చువల్ మాధ్యమంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆధ్వర్యంలో అనుబంధ యంత్రాంగం ఈ సమావేశానికి హాజరైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఢిల్లీ విజ్ఞాన్ భవన్ నుంచి వర్చువల్ మాధ్యమంలో సమావేశానికి హాజరైన పరిశీలకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయనతో పాటు పలువురు సీనియర్ ఎన్నికల సంఘం అధికారులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఏఎస్ వర్గాల నుంచి 2,150 మంది సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ చట్టబద్ధమైన మరియు చట్టబద్ధత లేని విధులపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల పరిశీలకులతో సీఈసీ చర్చించారు.

లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రాయగడ: యండీఖోల్ నుంచి రాయగడ మద్యం డిపోకు విదేశీ మద్యం బాటిళ్లతో వస్తున్న ఒక లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ సుశీల్ కుమార్ పటాన్నయక్ (32), బైకు చోదకుడు ప్రదీప్ బిడిక (29)లు తీవ్రగాయాలకు గురయ్యారు. వీరిని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించారు. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి చందిలి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. చండీఖోల్ నుంచి విదేశీ మద్యం లోడ్‌తో వస్తున్న లారీ కొలనార వద్దనున్న అగ్నిమాపక కేంద్రం వద్ద ఎదురుగా వస్తున్న ఒక బైకును ఢీకొంది. దీంతో అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ సంకల్ప్ రథం ప్రారంభం



సంకల్ప్ రథం ప్రారంభిస్తున్న కనక వర్ధన్ సింఘ్‌దేవ్

- ఎన్నికల వాగ్దానాల కోసం ప్రజాభిప్రాయ సేకరణ

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ సంకల్ప్ రథం ప్రారంభించింది. రాష్ట్ర శాఖ కార్యాలయం ఆవరణ నుంచి సోమవారం పచ్చజెండా ఊపి మాజీ మంత్రి కనక వర్ధన్ సింఘ్‌దేవ్ ఈ రథం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 లోక్‌సభ, 147 శాసన సభ నియోజకవర్గాల్లో సంకల్ప రథం పర్యటించి ఎన్నికల వాగ్దానాల కోసం రాష్ట్రంలో ఓటర్ల అభిప్రాయాలను సేకరిస్తుంది. దీనికోసం సంకల్ప రథంలో అభిప్రాయ సేకరణ డబ్బా ఏర్పాటు చేశారు. దీనిలో సేకరించిన అభిప్రాయాల ఆధారంగా మ్యానిఫెస్టో రూపకల్పన చేయడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల్లో ఓటరు అభిప్రాయం ప్రత్యక్షంగా సేకరించేందుకు రాష్ట్ర కార్యాలయం నుంచి 34 సంకల్ప రథాలను ప్రారంభించారు. ఈ

గ్లోబెల్ లీడర్‌గా భారత్

2047 నాటికి భారతదేశాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చడానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ నాయకులు అన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ చేసిన 235 ఎన్నికల వాగ్దానాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 222 హామీలను నెరవేర్చి చరిత్ర సృష్టించిందన్నారు. కేంద్రంలో మూడోసారి మళ్లీ అధికారంలోకి వస్తే చేపట్టాల్సిన సామాజిక సంక్షేమ పథకాలపై బీజేపీ ప్రజల అభిప్రాయాన్ని కోరుతున్నట్లు ఆ పార్టీ నేతలు వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు మూడు రోజుల పాటు వాహనాలు తిరుగుతూ 30 కోట్ల సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారన్నారు. వాహనాలపై ఏర్పాటు చేసిన అభిప్రాయ సేకరణ డబ్బాలో పేరు, చిరునామా రాసిన అభిప్రాయ పత్రాలను దాఖలు చేయాలని అభ్యర్థించారు. అనంతరం వారి అభిప్రాయాలను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపిస్తామని కనక్ వర్ధన్ సింఘ్‌దేవ్ తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను 90909 02024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా లేదా నరేంద్ర మోదీ యాప్ ద్వారా కూడా ప్రధానికి పంపవచ్చని బీజేపీ నేతలు తెలిపారు.



అభిప్రాయ సేకరణ ప్రారంభిస్తున్న దృశ్యం

మల్లికార్జున్ ఖర్గేతో మాజీ సీఎం గొమాంగో భేటీ



మల్లికార్జున్ ఖర్గేతో గొమాంగో కుటుంబ సభ్యులు

కొరాపుట్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో కుటుంబ సభ్యులతో పాటు సోమవారం కలిశారు. గిరిధర్ గొమాంగో కాంగ్రెస్ పార్టీ నుంచి కొరాపుట్ పార్లమెంట్ స్థానంలో 9 సార్లు గెలిపొందారు. ఒడిశా ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పుడు అతని సతీమణి హేమావతి గొమాంగో కొరాపుట్ ఎంపీగా గెలిపొందారు. అనంతరం ఈ కుటుంబం రాజకీయంగా అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంది. దీంతో గిరిధర్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. కానీ ఆ పార్టీలో సరైన గుర్తింపు రాలేదు. ఇదే సమయంలో హేమా గొమాంగో కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరినా ఫలితం లేకపోయింది. చివరకు కుటుంబం మొత్తం ఒకేసారి బీఆర్ఎస్‌లో చేరి సంచలనం సృష్టించారు. అయితే బీఆర్ఎస్‌లో సైతం ఇమడలేక మాతృసంస్థ కాంగ్రెస్ గూటికి చేరారు.

కాంగ్రెస్ కంచుకోట కొరాపుట్

రాష్ట్రంలో కాంగ్రెస్‌కి కంచుకోటలా కొరాపుట్ పార్లమెంటరీ స్థానం ఉంది. దీంతో గొమాంగ్ కుటుంబం కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్లు కోసం తమ ప్రయత్నాలు ప్రారంభించింది. ఎలాగో కొరాపుట్‌లో కాంగ్రెస్‌కు సిట్టింగ్ ఎంపీ సప్తగిరి ఉల్కా ఉన్నందున, గొమాంగో కుమారుడు సిసిర్ గొమాంగో(మిట్టు) నబరంగ్‌పూర్ లోక్ సభపై దృష్టి సారించారు. ఈ స్థానంలో కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. మరోవైపు హేమా గొమాంగో గుణుపూర్ లేదా లక్ష్మీపూర్ విధానసభ స్థానాల కోసం టిక్కెట్ ప్రయత్నం చేస్తున్నారు. గుణుపూర్ వారి సొంత నియోజకవర్గం కావడంతో పాటు హేమ ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిపొందారు. దీంతో టిక్కెట్లు కోసం ఖర్గేకు వినతి అందజేసినట్లు ప్రచారం జరుగుతోంది.

సత్తిగూడ జలాశయంలో మహిళ మృతి



రాధ మాడీ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి సత్తిగూడ జలాశయంలో మునిగి ఒక మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బీమ్ రంగిణీ గ్రామానికి చెందిన హతిరమ్ మాడీ, రాధ మాడీ అనే భార్యభర్తలు సోమవారం తెల్లవారు జామున జలాశయంలో చేపల వేటకి వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు రాధ మాడీ(50) నదిలో మునిగిపోయింది. దీంతో భర్త జలాశయంలో వెతికినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం గ్రామానికి వచ్చి స్థానికులకు విషయం తెలియజేశాడు. స్థానికుల సాయంతో జలాశయంలో సోమవారం గాలించగా ఆమె మృతదేహం లభ్యమైంది. విషయం తెలిసిన సింద్రిమాల గ్రామ సర్పంచ్ ఘసి నాయిక్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఐఐసీ రీగాన్‌కిండో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలియజేశారు.

మారణాయుధాల ముఠా అరెస్టు

- 4 పిస్టల్స్, 12 బుల్లెట్లు స్వాధీనం

భువనేశ్వర్:

కటక్ నగరం సమీపంలోని జగత్‌పూర్ ప్రాంతంలో అంతర్ రాష్ట్ర మారణాయుధాల స్మగ్లింగ్ సిండికేట్‌కు చెందిన 3 మంది సభ్యులను కమిషనరేట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. వారి నుంచి 4 పిస్టల్స్, 12 పేలని తూటాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక 9 ఎంఎం, ఒక 7.65 ఎంఎం పిస్టల్, ఒక రివాల్వర్, ఒక నాటు పిస్తోలు ఉన్నట్లు పేర్కొన్నారు. కటక్ డీసీపీ కన్వర్ విశాల్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ అరెస్టైన వారిలో కటక్‌కు చెందిన బబువా అలియాస్ ప్రకాష్ బెహరా (42)కు వ్యతిరేకంగా 10 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగతా ఇద్దరిని జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన పింటూ అలియాస్ ప్యారీమోహన్ దాస్ (41), మిహిర్ కుమార్ రే (39)గా నిర్ధారించారు. వారు ముంగేర్ (బీహార్) నుంచి తుపాకీలను సేకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తదుపరి విచారణ కోసం పోలీసు బృందాన్ని బీహార్‌కు పంపనున్నట్లు డీసీపీ తెలిపారు. నగరంలోని చుట్టుపక్కల జిల్లాల్లో ఏటీఎం క్యాష్ వ్యాన్లను దోచుకునేందుకు ముఠా సభ్యులు ప్లాన్ చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. తదుపరి విచారణ కోసం వారిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. ఈ ముఠాలోని మరో 2 మంది సభ్యులను కూడా గుర్తించామని, వారిని పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.



స్వాధీనం చేసుకున్న పిస్టల్స్, తూటాలు, సెల్‌ఫోన్లు

230 కిలోల గంజాయి స్వాధీనం



రాయగడ: పోలీసులకు చిక్కిన నిందితులు

బరంపురం: బరంపురం వైపు గంజాయితో వస్తున్న బొలేరో వాహనాన్ని 56వ నంబర్ జాతీయ రహదారి వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. బరంపురం ఎక్సైజ్ ఎస్పీ రమేంద్ర నాయక్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం 56వ నంబర్ జాతీయ రహదారి మీదుగా బరంపురం నగరం వైపు గంజాయి తరలిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో అధికారులు జాతీయ రహదారిలో తనిఖీలు చేపట్టారు. గజపతి–గంజాం జిల్లాల సరిహద్దు పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి పుంజిక్రైయా జంక్షన్‌లో అటువైపు వస్తున్న బొలార్ వాహనంపై దాడి చేశారు. దీంతో వాహనంలో 20 బస్తాల్లో తరలిస్తున్న 230 కిలోల గంజాయిని సీజ్ చేసి, నిందిత డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు జిల్లాలోని సన్నోఖేముండి బ్లాక్‌కి చెందిన నారాయణ రౌథ్‌గా గుర్తించారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.44 లక్షలు ఉంటుందని తెలిపారు.

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల పోలీసులు ఆదివారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో 31.220 కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో కేరళ రాష్ట్రం ఎన్నాకులం ప్రాంతానికి చెందిన అలబిన్ వర్గీస్ (24), అఖిల్ కిమెంట్ సురేష్ (22), శరత్ సాయి(22), సహీల్ జకీర్ (25)లు ఉన్నారు. అంబొదళ పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం..

ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అంబొదళ కార్గిల్ కూడలి వైపు నుంచి నలుగురు వ్యక్తులు బ్యాగులు పట్టుకుని వేగంగా రైల్వేస్టేషన్ వైపు వెళ్తుండడం గమనించారు. దీంతో అనుమానం వచ్చిన వారిని ఆపి బ్యాగుల తనికీలు నిర్వహించగా గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారి నుంచి గంజాయితో పాటు 5 సెల్‌ఫోన్లు, మూడు వాచ్‌లు, ఆధార్, ఓటరు కార్డులు స్వాధీనం చేసుకున్నారు.



అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు



రాయగడ: నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

ఆసక్తికరంగా శతావధానం



వివరాలు వెల్లడిస్తున్న భళ్లమూడి నాగరాజు

రాయగడ: స్థానిక ఉత్కళాంధ్ర తెలుగు సేవా సమాజం 27వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా భీమడోలుకు చెందిన ప్రముఖ శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శతావధానం ఆసక్తికరంగా సాగింది. బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా శతావధానం నిర్వహిస్తున్నట్లు వివరించారు. శ్రీకాకుళం జిల్లా ఉర్లాంకు చెందిన బంకుపల్లె రమేష్ శర్మ అవధాన సభా సంచాలకుడిగా వ్యవహరించారు. బ్రాహ్మణ సేవా సమాజం కార్యదర్శి భళ్లమూడి నాగరాజు మాట్లాడుతూ.. గతేడాది అష్టావధానం నిర్వహించిన స్ఫూర్తితో శతావధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కవులతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అవధానంలో పాల్గొన్నారు. అనేక ప్రశ్నలను కవులు సంధించారు. సమస్య దత్తపది, ఆసువు, వర్ణన వంటి అంశాలు నిర్వహించారు. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, బరంపురం ప్రాంతాల నుంచి కవులు, పండితులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో వేంకటేశ్వర ఆలయ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌలి కుముంధాన్, స్పందన అధ్యక్షుడు గుడ్ల గౌరి ప్రసాద్, కొల్లూరు శేషసాయి, కాకర్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



అపర్ణను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



అవధాని బులుసు అపర్ణ, బంకుపల్లి రమేష్‌లు

క్లుప్తంగా

కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

పర్లాకిమిడి: శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మహాదేవపురం వద్ద ఒడిశాకు చెందిన కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో 17 మంది గాయపడ్డారు. తీవ్రగాయాలైన ఒకరిని పర్లాకిమిడి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి, మరొకరిని బరంపురం మెడికల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ తరంగడ పంచాయతీ కుట్టాబడ గ్రామానికి చెందిన 17 మంది కూలీలు గుణుపురానికి ట్రాక్టరులో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి కొత్తూరు పోలీసుస్టేషన్ అధికారి విచారిస్తున్నారు. ప్రమాదం సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

సెక్స్ రాకెట్ గుట్టురట్టు



అరెస్టైనవారిని తరలిస్తున్న పోలీసులు

బరంపురం: నగర శివారులో కొద్ది రోజులుగా రహస్యంగా నిర్వహిస్తున్న సెక్స్ రాకెట్ గుట్టును పోలీసులు దాడులు చేసి రట్టు చేశారు. ఐఐసీ అధికారి వివేక్‌నంద స్వాంయి తెలిపిన వివరాల మేరకు.. గోశంతర పోలీసు స్టేషన్ పరిధి రళవ రహదారి 6వ లైన్‌లో ఉన్న ఒక ఇంటిపై ముందస్తు సమాచారంతో పోలీసులు సోమవారం దాడి చేశారు. దీనిలో భాగంగా ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులను అరెస్టు చేశారు. అరెస్టైనవారి దగ్గర నుంచి రూ.22 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిని కోర్టులో హాజరు పరిచారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైలు నుంచి బ్రౌను షుగర్ లావాదేవీలు

- 7 మంది నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులతో పోలీసులు

భువనేశ్వర్: ఖుర్దా జైలు నుంచి బ్రౌను షుగర్ లావాదేవీల వ్యవహారంలో 7 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఒక మహిళ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల్లో 19 ఏళ్ల వయస్సు ఉన్నవారు నలుగురు నిందితులు ఉన్నారు. వీరిలో ప్రమోద్ కుమార్ పండా, సుమన్ సెఠి, షేక్ అక్రమ్, అమిత్ సాహు ఉన్నారు. మిగిలిన వారిలో కాలూచరణ్ భుయ్యా (29), దేబాశిష్ పట్నాయక్ (21), పుష్పా నాయక్ (35)ని అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. వీరి దగ్గర నుంచి 9 సెల్‌ఫోన్లు స్వాధీనపరచుకున్నారు. లోగడ జైలు నుంచి బ్రౌను షుగర్ లావాదేవీల వ్యవహారంలో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. తాజా అరెస్టుతో నిందితుల సంఖ్య సమగ్రంగా 11కి చేరింది.

6 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కూర్మనూర్ పంచాయతీ మాల్బ్రక్క గ్రామ అడవిలో అక్రమంగా తరలించేందుకు ఉంచిన గంజాయిని కలిమెల పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మాల్బ్రక్క అడవి నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధం చేసినట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో కలిసి రాత్రి 11 గంటల సమయంలో దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన గంజాయి మాఫియా వ్యక్తులు 32 బస్తాల్లో గంజాయిని వదిలి పరారయ్యారు. దీంతో పోలీసులు 630 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సీబీఎస్‌ఈ పరీక్ష కేంద్రం పరిశీలన

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశపెట్టిన సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించి బోర్డు పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం సమగ్రశిక్షా పథకం ఏఎంఓ జి.లక్ష్మీనారాయణ, జీసీడీఓ కె.నీరజ రాజపురం పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం ఏపీ మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్‌లో విద్యాబోధన నిర్వహించింది. ఈ నేపథ్యంలో 8, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో సీబీఎస్‌ఈ సిలబస్‌తో నిర్దేశించిన ప్రశ్న పత్రాన్ని ఇచ్చారు. తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలబాలికలు వచ్చే ఏడాది టెన్త్‌ను సీబీఎస్‌ఈ విధానంలో రాస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులు, బుక్‌బ్యాంక్‌ల నిర్వహణ తీరుపై జీసీడీఓ కే నీరజ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు.

జలేశ్వర్ గ్రిడ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం

- 150 గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా జలేశ్వర్ ప్రాంతం గ్రిడ్ స్టేషన్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో 150కి పైగా గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సత్వర పునరుద్ధరణకు అనుబంధ యంత్రాంగం రంగంలోకి దిగింది. జలేశ్వర్ నువా బజార్‌లో ఉన్న గ్రిడ్ స్టేషన్‌లో ఈ ప్రమాదం సంభవించడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. విపత్తు నిర్వహణలో భాగంగా అధికారులు చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అధునాతన పరికరాలతో ఘటనా స్థలికి చేరుకుని



భువనేశ్వర్: జలేశ్వర్ గ్రిడ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం




కొరాపుట్: మంటలను అదుపు చేస్తున్న నబరంగ్‌పూర్ అగ్నిమాపక సిబ్బంది

కొన్ని గంటలపాటు నిర్విరామంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అనుమానిస్తున్నారు.

కొరాపుట్: షార్ట్ సర్క్యూట్ వలన మిల్క్ ట్యాంకర్ దగ్ధమైన ఘటన కొరాపుట్-నబరంగ్‌పూర్ జిల్లాల మధ్య ఇంద్రావతి నది వద్ద సోమవారం చోటుచేసుకుంది. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణం నుంచి పాలు తీసుకొని వస్తున్న ప్రభుత్వ ఓంఫెడ్ లారీ ట్యాంకర్ జయపూర్ వైపు వెళ్తుంది. లారీ ఇంద్రావతి నది వద్దకు చేరుకోగానే ఇంజిన్ నుంచి వెంటనే మంటలు రేగాయి. ఇది గమనించిన సిబ్బంది క్యాబిన్ నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారు. వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర అగ్నిమాపక దళాలు అక్కడి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. అనంతరం ఈ ఘటనపై అగ్నిమాపక విభాగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



భువనేశ్వర్: రాష్ట్రమంతటా ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయి. ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సమాచారం. రానున్న మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రత 4 నుంచి 6 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో రానున్న రోజుల్లో కొన్నిచోట్ల పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌ను తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా. దీని ప్రభావంతో ఒడిశా అంతటా తీవ్ర వేడిగాలులు వీస్తాయి. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఈ ఏడాది భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ శాఖ పేర్కొంది. భారతదేశంలో ప్రస్తుతం ఎల్‌నినో చురుకుగా కొనసాగుతోంది. దీని ప్రభావం కారణంగా రాష్ట్రంలో ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. సోమవారం రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటింది.

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
బౌధ్	37.7
మల్కన్‌గిరి	37.0
భవానీపట్న	37.0
సోన్‌పూర్	37.0
బొలంగీరు	36.8
అంగుల్	35.7
పర్లాకిమిడి	35.6
ఝార్సుగుడ	35.6
నయాగడ్	35.5
ఫుల్బాణి	35.4
తాల్చేరు	35.4
భువనేశ్వర్	35.2
సుందరగడ్	35.0

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మన్మథరావు మృతదేహం

పర్లాకిమిడి: గుసాని సమితి గారబంద పోలీసుస్టేషన్ పరిధి సరియాపల్లి సమీపంలోని వీరనారాయణపురం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గారబంద వీరనారాయణపురం జాతీయ రహదారి వద్ద రెండు బైకులు ఎదురెదురుగా వేగంగా రావడం వల్ల దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో మేస్త్రీ పట్నాన మన్మథరావు (38) సంఘటన స్థలంలో మృతి చెందగా, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టికి చెందిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యి కోమాలోకి వెళ్లిపోయాడు. పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు ఆయనను మెరుగైన వైద్యం కోసం బరంపురం మెడికల్‌కు తరలించారు. బైక్ నుంచి పడిపోయిన మెళియాపుట్టి గ్రామానికి చెందిన వ్యక్తి (పేరు తెలియలేదు)పై లక్ష్మీబస్సు వెళ్లిపోవడంతో



వీరనారాయణపురం వద్ద ప్రమాద దుర్ఘటన

కాలికి తీవ్రగాయమైనట్లు గురండి పోలీసు ఐఐసీ రోబి పాత్రో తెలియజేశారు. మృతి చెందిన వీరనారయణపురం గ్రామానికి చెందిన పట్నాన మన్మథరావు (38) మృతదేహాన్ని పర్లాకిమిడి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం చేశారు.

రెక్టార్, రిజిస్ట్రార్ నియామకాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రెక్టార్‌గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ పీలా సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని నియామక పత్రాలను సోమవారం అందజేశారు. డిసెంబర్ 30 నుంచి ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా అడ్డయ్య కొనసాగుతున్నారు. ప్రస్తుతం రెక్టార్‌గా బాధ్యతలు స్వీకరించారు. బయోటెక్నాలజీ ప్రొఫెసర్ సుజాత సీడీసీ డీన్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. రెక్టార్ అడ్డయ్య 1994లో ఎకనామిక్స్ రీసెర్చ్ అసిస్టెంట్‌గా ఏయూ పీజీ సెంటర్‌గా ఉన్న ఎచ్చెర్ల పీజీ కేంద్రంలో తన సర్వీస్ ప్రారంభించారు. వర్సిటీ ఏర్పడ్డాక ఇక్కడ ఆప్షన్ ఇచ్చుకున్నారు. రిజిస్ట్రార్ సుజాత 2010లో బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.



రిజిస్ట్రార్‌గా పీలా సుజాతకు, రెక్టార్‌గా బిడ్డిక అడ్డయ్యకు నియామక పత్రం అందజేస్తున్న వీసీ రజిని

హస్తినలో ఎగిరిన సిక్కోలు కీర్తి పతాక

- నమో డ్రోన్ దీదీ కార్యక్రమానికి హాజరైన పోలాకి మండలం నుసరాం మహిళ
- ప్రధాని ముందు డ్రోన్ ఎగరవేసిన అరసవిల్లి గాయత్రి
- సాగులో డ్రోన్ల వినియోగంపై వైఎస్ జగన్ సర్కారు ప్రత్యేక శ్రద్ధ
- ఇప్పటికే రెండు సార్లు ఔత్సాహిక మహిళలకు శిక్షణ
- తర్ఫీదు పొందిన వారిలో 10మందికి డ్రోన్లు మంజూరు





వ్యవసాయ డ్రోన్ ఎగరవేసే ముందు ప్రధానమంత్రితో అరసవిల్లి గాయత్రి మాటామంతీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మన ఆడపడుచుకు దేశ రాజధానిలో అపురూప గౌరవం దక్కింది. మట్టిని నమ్ముకుని బతుకుతున్న మహిళా రైతుకు ప్రధాని ముందు డ్రోన్ ఎగురవేసే అపూర్వ అవకాశం వచ్చింది. ఢిల్లీలో సోమవారం జరిగిన నమో డ్రోన్ దీదీ కార్యక్రమంలో పోలాకి మండలం నుసరాం గ్రామానికి చెందిన అరసవల్లి గాయత్రి అనే మహిళా రైతు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచనలు కార్యరూపం దాల్చడంతో ఈ మొదటి అడుగు పడింది. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టిసారించింది. శిక్షణ పొందిన మహిళలతో వ్యవసాయ సాగుకు డ్రోన్ల వినియోగం తీసుకురావాలని ఆలోచన చేసింది. దానిలో భాగంగా శిక్షణ పొందిన



వ్యవసాయ సాగులో వినియోగించేందుకు మంజూరైన డ్రోన్లు

మహిళలకు నమో డ్రోన్ దీదీలో భాగంగా డ్రోన్లు కూడా మంజూరయ్యాయి.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

వ్యవసాయ సాగులో డ్రోన్లను వినియోగించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే సబ్సిడీతో డ్రోన్లు మంజూరు చేసేందుకు ముందుకు వచ్చింది. అందులో భాగంగానే మహిళలకు ప్రత్యేక తర్ఫీదు నిచ్చి, వారి చేత వ్యవసాయ సాగులో డ్రోన్లు వినియోగంలోకి తెచ్చి దిగుబడులు పెంచడమే కాకుండా సాగు ఖర్చులను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ క్రమంలో ఆసక్తి చూపుతున్న వివిధ స్వచ్ఛంద సంస్థల సాయంతో మహిళలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చే విధంగా ప్రోత్సహిస్తోంది. దానిలో భాగంగా మన జిల్లాలో అగ్రి బిజినెస్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ద్వారా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. అందులో శిక్షణ పొందిన 10మంది మహిళలకు నమో డ్రోన్ దీదీ స్కీమ్‌లో డ్రోన్లు మంజూరయ్యాయి.

గుంటూరులో మరో 9మంది..

మంజూరైన వారిలో పోలాకి మండలం నుసరాం గ్రామానికి చెందిన అరసవిల్లి గాయత్రి సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి హాజరై, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందు డ్రోన్ ఎగురవేశారు. ఆ అనుభవాలను కూడా ఆమె ప్రధానితో పంచుకున్నారు. మిగతా 9మంది గుంటూరులో జరిగిన వర్చువల్ ప్రోగ్రామ్‌లో పాల్గొని తమకు మంజూరైన డ్రోన్లు ఎగురవేశారు. మన రైతు మహిళ గాయత్రి నేరుగా ప్రధానితో మాట్లాడడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

ఎంతో మేలు..

- వ్యవసాయ డ్రోన్లతో రైతులకు మేలు జరగనుంది.
- తక్కువ ఖర్చుతో, తక్కువ మందుతో, తక్కువ సమయంలో గ్రామం మొత్తం పిచికారి చేయడానికి డ్రోన్లు దోహదపడతాయి.
- పంట దిగుబడులు పెరగడమే కాకుండా దిగుబడి నాణ్యత పెరిగి మంచి ధర లభిస్తుంది.
- డ్రోన్ల టెక్నాలజీ వల్ల కాలుష్యం బాగా తగ్గుతుంది.
- రోజురోజుకీ వ్యవసాయానికి దూరమవుతున్న రైతన్నను వ్యవసాయ రంగంలోకి వచ్చేలా ప్రోత్సహించేలా ఉంటుంది.



గుంటూరులో వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో మంజూరు పత్రాలు అందుకుంటున్న రైతులు

22 నుంచి శ్రీకూర్మనాథుని డోలోత్సవాలు



గార: ప్రముఖ విష్ణు క్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథాలయంలో విశేష ఉత్సమైన డోలోత్సవం ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించనున్నామని ఈఓ జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు అన్నారు. సోమ వారం ఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 22న శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి కామదహన మంటపం వద్ద మఖ ఉత్సవం, 23, 24వ తేదీలో సమీప శ్రీకూర్మం- మత్స్యలేశం వద్ద సముద్ర స్నానాలు (పడియ), 25వ తేదీ పౌర్ణమి పురస్కరించుకొని డోలోమంటపంలో ఉత్తరాభిముఖ దర్శనంతో పాటు బుక్కా, బర్గుండ పూజ జరుగుతాయన్నారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకోవాలని కోరారు.

మరో నలుగురు ఇంటర్ విద్యార్థులు డీబార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు అత్యంత పకడ్బందీగా కొనసాగుతున్నాయి. పరీక్షల్లో 8వ రోజు సోమవారం మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన నలుగురు సెకెండియర్ విద్యార్థులు పట్టుబడగా వీరిని అధికారులు డీబార్ చేశారు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, టెక్కలి విశ్వజ్యోతి జూనియర్ కళాశాలలో ఒకరు, టెక్కలి బీఎస్ అండ్ జేఆర్ జూనియర్ కళాశాలలో ఇద్దరు పట్టుబడ్డారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు మాల్‌ప్రాక్టీసు కింద డీబారైన విద్యార్థుల సంఖ్య పదికి చేరుకుంది. 8వ రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 878 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 18037 మందికి 828 మంది, ఒకేషనల్ విభాగంలో 1208 మందికి 50 మంది గైర్హాజరయ్యారు.





అశేష భక్తజనం మధ్య చక్రతీర్థ స్నానం (ఇన్‌సెట్‌లో) నంది వాహనంపై ఉత్సవమూర్తులు

సుమనోహర క్రతువు

- వైభవంగా ముఖలింగేశ్వరుని త్రిశూల చక్రతీర్థ స్నానం
- భక్తజనంతో నిండిపోయిన వంశధార

తీరంతో సైకత లింగాలు ప్రాణం పోసుకున్నాయి. నదిలో నీటి బిందువులు గంగమ్మను ఆవాహన చేసుకున్నాయి. గర్భగుడి వదిలిన ముఖలింగేశ్వరుడు ఊరేగింపుగా ముందుకు కదలగా.. వెంట భక్తజన ప్రవాహం ఉపనదిలా సాగి వంశధారలో కలిసింది. భక్తుల గళములన్నీ గరళకంతుని కీర్తించగా.. స్వామి తనువును తాకిన జలము తీర్థమై విరాజిల్లింది. ఇసుక రేణువుల్లో అణువణువు ప్రమధ గణాలను ఆహ్వానించగా.. మధుకేశ్వరుని చక్రతీర్థ స్నాన క్రతువు పవిత్ర యాగంలా సాగింది.



చక్రతీర్థ స్నానాన్ని ఆచరిస్తున్న మహిళ

జలుమూరు, ఎల్ఎన్ పేట:

శ్రీముఖలింగంలోని శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం త్రిశూల చక్రతీర్థ స్నానాలు వైభవంగా జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య స్వామి వారి చక్రతీర్థ స్నానాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుద్ధ పాడ్యమి ఘడియల అనంతరం 12 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అర్చకులు పంచాది ప్రభాకర రావు వెంకటాచలం, రవి శంకర్ తదితరులు ఆలయ గర్భగుడి నుంచి బయటకు తీసుకువచ్చారు. స్వామికి ఎస్పీ జీఆర్ రాధిక మొదటి హారతినిచ్చి టెంకాయ కొట్టారు. అప్పటికే సిద్ధం చేసిన నంది వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి వంశధార ఒడ్డుకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అప్పటికే భక్తులు వేలాదిగా వంశధార చేరుకుని ఎదురుచూస్తున్నారు. సంప్రదాయం ప్రకారం మిరియాపల్లి రేవులో లుకలాపు కుటుంబీకులు స్వామికి చక్రతీర్థ స్నానాలు నిర్వహించి చేనేత వస్త్రాలు, యజ్ఞోపవీతం సమర్పించారు. క్రతువు ముగిసిన వెంటనే మళ్లీ స్వామిని గర్భగుడికి చేర్చారు.

ఫలించిన అధికారుల వ్యూహం

చక్రతీర్థ స్నానాల్లో భక్తులను అదుపు చేసేందుకు అధికారులు ప్రత్యేక వ్యూహం పాటించారు. నదికి రెండు వైపులా ఐరన్ డబుల్ బారికేడ్లు పెట్టడంతో రద్దీ తగ్గింది. స్వామి దర్శనం కూడా చక్కగా జరిగింది. ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక చొరవతో ప్రధాన ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు, రోప్ పార్టీ ఏర్పాటు చేశారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి భక్తులకు సులువుగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి

- 108, 104 అరబిందో సంస్థ మేనేజర్ నజీర్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న నజీర్ హుస్సేన్

విజయనగరం ఫోర్ట్: 108, 104 అంబులెన్సుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని 108, 104 అరబిందో సంస్థ మేనేజర్ నజీర్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రమాదం జరిగిందని సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పించాలని కోరారు. సంఘటన స్థలానికి చేరుకున్న వెంటనే అవసరమైన చికిత్సను ప్రారంభించాలని సూచించారు. విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ అయిన రోగులను సకాలంలో చేర్చాలని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి 104 వాహనాన్ని నిర్దేశిత సమయానికి చేర్చాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ షణ్ముఖ, రవికుమార్, సంతోష్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు నారాయణరావు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామానికి చెందిన పతివాడ నారాయణరావు(48)ను బైక్ ఢీకొట్టడంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. నీలావతి గ్రామంలో జరిగిన జాతరకు నారాయణ రావు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా నరవ అట్టల కంపెనీ వద్దకు వచ్చేసరికి నరవ నుంచి బైక్‌పై వస్తున్న బొండపల్లి మండలం కొత్తురుకు చెందిన ఫణికుమార్ ఢీకొట్టాడు. దీంతో నారాయణరావుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడినుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్రనాయుడు చెప్పారు.

ఆగి ఉన్న వ్యాన్‌ను బైక్ ఢీకొని యువకుడు..



సంఘటనా స్థలంలో తీవ్ర రక్తస్రావంతో నరేంద్ర

విజయనగరం క్రైమ్: స్థానిక జమ్ము నారాయణపురం రోడ్డులో ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. సోమవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వ్యాన్ ఫ్రంట్ వీల్ పంక్చర్ అవడంతో డ్రైవర్ బాగు చేసుకుంటున్నాడు. అంతలో వెనుక నుంచి వెస్పా బైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు ఐషర్ వ్యాన్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్ మధ్యలో కూర్చున్న వేమల నరేంద్ర (19) తొడవద్ద కట్ అవడంతో తీవ్రరక్తస్రావమైంది. దీంతో హుటాహుటిన కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ఆర్.వాసుదేవ్ తెలిపారు.

దళాయిపేటలో గజరాజుల గుంపు



దళాయిపేట గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలోని దళాయిపేట, వన్నాం గ్రామాల మధ్య గజరాజులు సంచరిస్తున్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. రైతులు ఏనుగుల జాడను తెలుసుకుని పొలాల్లోకి వెళ్లాలన్నారు. సీమనాయుడు వలస కూడలి నుంచి దళాయిపేట వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. గజరాజులు కనిపిస్తే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

శివాలయంలో రెండు హుండీల చోరీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ శివాలయంలో ఆదివారం అర్ధరాత్రి రెండు హుండీలు చోరీకి గురయ్యాయి. సోమవారం వేకువజామున శివాలయంలో నిత్య కైంకర్యాలు చేసేందుకు అర్చకులు వెళ్లగా రెండు హుండీలు చోరీకి గురైనట్లు గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. హుండీలో సుమారు రూ.50 వేల నగదు ఉండవచ్చునని ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. రెండు హుండీల్లో నగదు దొంగలించి సమీప పొలాల్లో హుండీలను విడిచిపెట్టి దుండగులు పరారయ్యారు. గ్రామ పెద్దల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్ కిందనే ఉపశమనం

- వైఎస్సార్‌సీపీలోకి పెరుగుతున్న వలసల జోరు
- టీడీపీని వీడుతున్న సీనియర్ కార్యకర్తలు
- 25 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రతిపక్ష టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు జోరందుకున్నాయి. టీడీపీ విధి, విధానాలు, సిద్ధాంతాలు నమ్మి మోసిపోయామని అంటున్న కరుడుగట్టిన ఆ పార్టీ సీనియర్ కార్యకర్తలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నారు. ఇందులో భాగంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గడిచిన 40 ఏళ్లుగా టీడీపీలో ఉంటూ పార్టీకి సేవలందించి సీనియర్ కార్యకర్తలుగా గుర్తింపుసాధించిన 8వ డివిజన్ లెంకవీధిలోని వెలమ సామాజిక వర్గానికి చెందిన 25 కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

ప్రభుత్వ పాలనకు మద్దతు

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు, నగరంలో చేపడుతున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. గడిచిన 4 ఏళ్ల 10 నెలల కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ పాలనకు మద్దతు తెలుపుతున్నారంటూ సంతోషం వెలిబుచ్చారు. నూతన చేరికలతో పార్టీకి మరింత బలం చేకూరుతోందని చెప్పారు. 8వ డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా టీడీపీకి అంటిపెట్టుకున్న 25 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. పార్టీలో నూతనంగా చేరిన వారందరికీ ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన ఈర్ల శ్రీనివాసరావు, శంకరరావులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా టీడీపీకి సేవలు అందించినప్పటికీ సరైన సహకారం పార్టీ నాయకుల నుంచి తమకు అందకపోవడంతో నిరాశ, నిస్పృహకు గురైన తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. కోలగట్ల వీరభద్ర స్వామి నాయకత్వంపై నమ్మకం ఉందని రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి ఆయన విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, డివిజన్ ఇన్‌చార్జి ఆదారి నగేష్, చిల్లా పుష్ప, ముల్లు త్రినాథ్, యర్రా అప్పలసత్యం, అల్లు దివాకర్, రాకోడు పైడి రాజు, ఈర్ల ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి తదితరులు

వైఎస్సార్‌సీపీలో చేరిన 45 కుటుంబాలు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన 45 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరారు. వారికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలను ఎలా ఏమార్చాలా? అని చంద్రబాబు అండ్‌కో చూస్తున్నారని విమర్శించారు. కానీ ప్రజలవేవీ పట్టించుకోవడం లేదని ప్రజల మనసులో ఫ్యాన్ గుర్తు ఒక్కటే ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో రాగాల వెంకట రమణ, బొత్స హరికృష్ణ, గంట శ్రీరాములు, గంట శివ, బండి పరమేశ్వర రావు, పెదిరెడ్ల రామారావు తదితర కుటుంబాల వారున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్‌చైర్మన్‌లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, స్థానిక వార్డు ఇన్‌చార్జి చంద్రపూడి రమేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్తవలస యువత

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పురపాలక సంఘంలోని కొత్తవలస పరిధిలో గల 5, 6, 7 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అందరం కలిసి పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని వచ్చే సాధారణ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో గుడివాడ రాంబాబు, గవర ప్రశాంత్, ఎం.పవన్, జి.సందీప్, సువ్వాడ రవి, ఎస్.ప్రసాద్, చందక దిలీప్, ఎస్.గణేష్, బి.ప్రశాంత్, కె.కిశోర్, ఇంద్ర, మోహన్, దుర్గాప్రసాద్, రవి, సురేష్, పోలినాయుడులతో పాటు వారి కుటుంబసభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ జాతరకు సన్నాహం

- సమన్వయ సమావేశంలో పాల్గొన్న జెడ్పీచైర్మన్, ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కలిసి రావాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు కోరారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో జరగనున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలకు సంబంధించి సమన్వయ సమావేశాన్ని సోమవారం దేవస్థానం ఆవరణలో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ఏటా సంప్రదాయం ప్రకారం జరుగుతున్న విధంగానే ఈ ఏడాది కూడా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ నిర్ణయించిందని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరలో దాదాపు మూడు లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనంతో బాటు జాతరను తిలకించేందుకు వస్తారన్నారు. ప్రధానంగా ఈ నెల 17న ఆదివారం తెలవారు జామున 2 గంటల నుంచే దేవస్థానం వద్ద అమ్మవారి దర్శనానికి భక్తుల రద్దీ ఉంటుందని, జాతర మూడు రోజుల్లో రాత్రి సమయాల్లో భక్తులు రద్దీ మరింత పెరుగుతుందన్నారు.

పటిష్టంగా పోలీస్ బందోబస్తు

ప్రధానంగా ఈ నెల 18న సోమవారం రాత్రి ఆర్కెస్ట్రా, 19న చివరి రోజు బాణసంచా ప్రధాన ఆకర్షణగా నిలవనున్న నేపథ్యంలో లక్షల్లో భక్తులు వస్తారని, ట్రాఫిక్, అల్లరి మూకల సమస్య తలెత్తకుండా పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని కోరారు. జాతరకు వచ్చే భక్తులతో బాటు వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జాతరలో మూడు రోజులు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం వాటిల్లకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా మూడు రోజుల పాటు పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. దర్శనానికి సంబంధించి ఎలాంటి పాసులు జారీ చేయడం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ బి.శాంతి, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, గ్రామ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాల నాయుడు, దేవాదాయశాఖ ఈఓ జి.శ్రీనివాస్, తహసీల్దార్ ఎస్.ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, సీఐ షన్ముఖరావు, ఏపీఈపీడీసీఎల్ ఏఈ ప్రభాకర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.నాయక్, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం ఆలయ అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శాశ్వత యాగశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుద్‌హుద్ తుఫాన్ సమయంలో బోడికొండపై ఉన్న కోదండ రామాలయం శిథిలావస్థకు చేరినప్పటికీ నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.3కోట్ల నిధులు మంజూరు చేశారని, కొండపై శిథిలమైన రామాలయం స్థానంలో కొత్త ఆలయాన్ని జీర్ణోద్ధరించి ప్రారంభోత్సవం కూడా చేశామని చెప్పారు. మరో రూ.కోటి నిధులతో దిగువనున్న ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.75 లక్షల నిధులతో రామకోనేరు సుందరీకరణ పూర్తి చేశామన్నారు. గతంలో తాటాకుల యాగశాల ఉండేదని. నిత్య హోమాలు నిర్వహించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయాందోళనతో అర్చకులు, సిబ్బంది ఉండే వారన్నారు. శాశ్వత యాగశాల పూర్తి కావడంతో ఇక ఆ ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచరాపు రాము, తర్లాడ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



రామతీర్థంలో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తదితరులు

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఉరివేసుకున్న త్రిపాఠి



త్రిపాఠి (ఫైల్)

రాజాం సిటీ: రాజాం మండల పరిధి అంతకాపల్లి గ్రామం వద్ద ఉన్న టీటీడీకి చెందిన బాలాజీ టెంపుల్ ఆవరణలో మధ్యప్రదేశ్‌కు చెందిన బ్రిజ్‌బిహారీ త్రిపాఠి (39) అనే ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపాఠి 2018 నుంచి బాలాజీ టెంపుల్‌లో ప్రసాదాల తయారీదారుగా పనిచేస్తున్నాడు. అక్కడే బాలాజీ టెంపుల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఎప్పటిలాగానే సోమవారం ఆలయం తెరిచిన పురోహితులు ప్రసాదాల నిమిత్తం త్రిపాఠికోసం ఎదురుచూశారు. త్రిపాఠి ఎంతకీ రాకపోవడంతో రూమ్‌కి వెళ్లి చూడగా, లోపల ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ ఉండడాన్ని గమనించారు. దీంతో వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై వై.రవికిరణ్, వీఆర్‌ఓ గెడ్డాపు అనంత రావులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. త్రిపాఠి మృతదేహాన్ని కిందికి దించి చుట్టుపక్కల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో హిందీలో సూసైడ్ లెటర్ రాసి ఉండడం గమనించి ఆరాతీశారు. ఆ లెటర్‌లో త్రిపాఠి తాను తప్పుడు మార్గంలోకి తెలియకుండానే వెళ్లిపోయానని, బయటపడలేని పరిస్థితి ఉందని, చావే కరెక్ట్ అని భావించి ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసినట్లు పోలీసులు తెలిపారు. కె అనే పేరు కలిగిన వ్యక్తి కారణంగా ఇదంతా జరిగిందని అందులో పేర్కొన్నట్లు పోలీసులు వివరించారు. తాను మరణించిన అనంతరం మృతదేహాన్ని మధ్యప్రదేశ్‌లోని సాట్నా జిల్లా బ్రాహ్మణపోల గ్రామంలోని కుటుంబసభ్యులకు అప్పగించాలని కోరినట్లు చెప్పారు. ఆ లెటర్ స్వాధీనం చేసుకున్న పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నలుగురికి తీవ్రగాయాలు



ప్రైవేట్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యులు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస-విజయనగరం రోడ్డులో పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద ఆగి ఉన్న కారును లారీ ఢీకొట్టడంతో సోమవారం నలుగురు వ్యక్తులు తీవ్రగాయాల పాలయ్యారు. విజయనగరం నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న లారీ పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద కుడివైపు ఆగి ఉన్న కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుకు కదలగా అక్కడే ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు, నిలబడి ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాల పాలయ్యారు. గాయాలపాలైన వారిలో కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి సీతంపేటకు చెందిన ఎల్లపు రామారావు, ఎస్.అప్పారావు, దేశపాత్రునిపాలానికి చెందిన బి.మోహన్‌రావు, ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలో నివసిస్తున్న మోపాడ లక్ష్మి ఉన్నారు. క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేశారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ సమీపంలో గల ఆర్అండ్‌బీ రోడ్డులో రాయ్‌పూర్ నుంచి రాజమండ్రికి కుండీల లోడుతో వెళ్తున్న లారీ ఆవును తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. సోమవారం వేకువజామున జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్ టింకూకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఎల్విన్‌పేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని భద్రగిరి సీహెచ్‌సీలో చేర్పించి వైద్యసేవలు అందించారు.

రెండు కార్లు ఢీ: ఒకరికి స్వల్ప గాయాలు

గరుగుబిల్లి: మండలంలోని సీతారాంపురం జంక్షన్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ఒక కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రెండు బైక్‌లు ఢీకొని మరో నలుగురికి..

సంతకవిటి: మండల పరిధి ఎస్.రంగారాయ పురం జంక్షన్ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. సంతకవిటి నుంచి రాజాం వైపు ద్విచక్రవాహనంపై బోడసింగి గణేష్, మరో వ్యక్తి వస్తున్నారు. అదే సమయంలో రాజాం నుంచి సంతకవిటి వైపు ద్విచక్ర వాహనంపై కొరటాన రాజేష్, మరో వ్యక్తి వస్తుండగా ఎదురెదురుగా ఢీ కొనడంతో నలుగురూ రోడ్డుపై పడి గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై షేక్ శంకర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తులను ఆటోపై రాజాంలోని ఆస్పత్రికి తరలించారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక



పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శోభిక

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, ఎల్విన్‌పేట ఎస్‌డీసీ (ట్రైబల్ వెల్ఫేర్) ఆర్‌వి. సూర్యనారాయణతో కలిసి ప్రజలనుంచి 100 అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకర రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, గిరిజన సంక్షేమ ఈఈ శాంతేశ్వరరావు, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త కొయ్యాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులకు సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 8 ఫిర్యాదులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్ కుమార్, ఎస్‌బీ సీఐ సీహెచ్.లక్ష్మణ రావు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 29 వినతులు

సీతంపేట: స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 29 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈవో లిల్లీరాణి, సీడీపీవో రంగలక్ష్మి, పీఏవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు త్వరితగతిన న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల నుంచి 22 ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఎస్సై ప్రభావతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాదృక్పథం కీలకం

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి
- ఎంఆర్ కళాశాలలో 'క్వాంటమ్ మెకానిక్స్‌పై జాతీయ వర్క్‌షాప్




సత్కారం పొందుతున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి

విజయనగరం అర్బన్: ఆధునిక శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి కోసం విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి వారిలో పరిశోధనాదృక్పథం కీలకంగా నిలుస్తుందని ఆ దిశగా విద్యాబోధన ఉండాలని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ సౌజన్యంతో 'క్వాంటమ్ మెకానిక్స్' అంశంపై మూడురోజుల పాటు ఎంఆర్ ఆటానమస్ కళాశాలలో నిర్వహించే జాతీయ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాంటమ్ మెకానిజం చాలా ఆధునికమైనదని, సాంకేతిక పరిజ్ఞానం కొలతను వివరిస్తుందన్నారు. క్వాంటం మెకానిక్స్ అభివృద్ధితో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మంచి ఫలితాలు లభిస్తున్నాయని చెప్పారు. మొబైల్ ఫోన్లు, ఎల్ఈడీ లైట్లు, ఎలక్ట్రికల్ పరికరాల్లో ఇవి బాగా ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు పరిశోధన చేసి, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌కు ఐఎంఎస్‌సీ చెన్నైయ్‌కు చెందిన ప్రొఫెసర్ ఎంవీఎస్‌మూర్తి, ప్రొఫెసర్ వివేక్ థాతర్, మైసూర్ నుంచి ప్రొఫెసర్ కేఎస్‌మల్లిక్ ముఖ్యవక్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, పూర్వ కరెస్పాండెంట్స్ డాక్టర్ రాఘవరావు, డాక్టర్ డీఆర్‌కేరాజు, కోఆర్డినేటర్ కె.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, భౌతిక శాస్త్ర విభాగాధిపతి పి.సత్యనారాయణ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన 150 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

కొత్తవలస: విశాఖపట్నం-భవానీపట్నం ప్రత్యేక పాసింజర్ రైలు కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కొత్తవలస నుంచి విజయనగరం వైపు వెళ్లే డౌన్ లైన్, మధ్యలైన్‌లు దెబ్బతిన్నాయి. విజయనగరం వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి పట్టాలు తప్పిన రైలు ఇంజిన్‌ను, రెండు బోగీలను తొలిగించి తాత్కాలికంగా రైళ్ల రాకపోకలకు అధికారులు అవకాశం కల్పించారు. వివిధ విభాగాలకు చెందిన రైల్వే అధికారులు, సిబ్బంది సోమవారం తెల్లవారుజామునుంచే యంత్రాలతో ట్రాక్ పునరుద్ధరణ పనులను చేపట్టారు. వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్, ఏడీఆర్‌ఎం సాహు, సీనియర్ డీఎస్పీ సీహెచ్ రఘువీర్ తదితరులు పనులను పర్యవేక్షించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్తి స్థాయిలో రైళ్ల రాకపోకలకు అవకాశం కల్పించారు. ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపిస్తామని డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



యుద్ధ ప్రాతిపథికన పునరుద్ధరణ పనులను నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది